క్లుప్తంగా

250 కిలోల బియ్యం అందజేత

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి సహాయ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రూ.13 వేల విలువ చేసే 250 కిలోల బియ్యాన్ని కళాశాల అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవికి అందజేశారు. జయలక్ష్మీ రైస్ మిల్లు అధినేత, సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి వరప్రసాద్ ఈ సాయాన్ని అందించారని ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో రౌతుల ప్రసాద్, కళాశాల అధ్యాపకుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

కోడూరు: ఉల్లిపాలెం గ్రామంలో గంగానమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. రాత్రికి గ్రామస్తులంతా ఒకే సమయంలో నైవేద్యాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా యువకులు నృత్యాలతో సందడి చేశారు. వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీన మహాశివరాత్రికి తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ అధికారులకు సూచించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుతో కలిసి మంగళవారం దేవస్థానంలో క్యూలైన్లు, కృష్ణానది వద్ద జల్లు స్నానాల పైపులైన్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. చల్లపల్లి ఎస్ఐ చిన్నబాబు, అరజా కిరణ్‌కాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాలయం వార్షికోత్సవం



బంటుమిల్లి: పెందుర్రులోని కోదండ రామాలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరుభొట్ల ప్రసన్నకుమార్ శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ లక్ష్మీశకుంతల దంపతుల దీక్ష ధారణలతో ఉత్సవ మూర్తులకు మండపారాధన, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెడన: పెనుమల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి రాంబాబు ఇల్లు కాలిపోయి కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ మంగళవారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన సామాజిక పింఛనుదారు శ్రీకాకోళపు తులసమ్మ కుటుంబానికి తోటి పింఛనుదారులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. పింఛనుదారులు తమ పింఛను సొమ్ము నుంచి రూ. 100 సేకరించగా వచ్చిన రూ. 29,600 తులసమ్మ కుటుంబ సభ్యులకు గృహ సారథులు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లూరి శివాజీ, సీమ, గృహ సారథులు పాల్గొన్నారు.

17లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలి



పామర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి చేయాలని పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని 25 గ్రామాల్లో 16,764 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 47 శాతం మందికి రేషన్ అందించామని చెప్పారు. ఇచ్చిన గడువు లోగా మిగిలిన వారికి కూడా రేషన్ పంపిణీని పూర్తి చేయాలన్నారు. నూరు శాతం రేషన్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని అందిస్తోందని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఆర్వో సిరాజుద్దీన్, మొబైల్ వాహన నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయండి

గృహ సారథుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సింహాద్రి



గృహ సారథులకు మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, పరిశీలకులు కడవకొల్లు, శ్రీలక్ష్మి

అవనిగడ్డ: ప్రజల బాగోగులు తెలుసుకుని ప్రభుత్వానికి మరింత పేరు తెచ్చేలా గృహ సారథులు పనిచేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం గృహ సారథుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గృహ సారథుల కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు మరింత పారదర్శకంగా అందేలా దోహదపడతాయని చెప్పారు. పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి ఎవరూ లేరని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు మరింత వివరించేలా గృహ సారథులు పనిచేయాలన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఎంత బడ్జెట్ ఉందో ఇప్పుడూ అంతే ఉందని, కానీ ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ అప్పుడు లేవన్నారు. పథకాలకు అమలు చేసే నిధులు అప్పుడు జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని ఎమ్మెల్యే సింహాద్రి విమర్శించారు.

గాంధీ క్షేత్రం ఖాళీ చేయించండి..

దివిసీమ ప్రజలకు మేలు చేకూరేందుకు సీఎం సభను ఏర్పాటు చేస్తే గ్రౌండ్‌లో రాళ్లు ఉన్నాయని టీడీపీ నేతలు రాద్ధాంతం చేయడం సిగ్గు చేటన్నారు. సభ అనంతరం వర్షాలు రావడం, తరువాత ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల గ్రౌండ్‌ను సరిచేయించలేక పోయామని చెప్పారు. విద్యా సంస్థలకని ఇచ్చిన గాంధీ క్షేత్రాన్ని 90 సంవత్సరాలు లీజుకు తీసుకుని అందులో వ్యాపారాలు చేయిస్తూ అద్దెలు వసూలు చేయడం, పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం టీడీపీ నేతలకు కనబడటం లేదా అని ఎమ్మెల్యే సింహాద్రి ప్రశ్నించారు. డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను బాగు చేయిస్తామని, దమ్ముంటే మీరు గాంధీ క్షేత్రాన్ని ఖాళీ చేయిస్తారా అని టీడీపీ నేతలకు ఎమ్మెల్యే సవాల్ విసిరారు. మండల సచివాలయ కన్వీనర్ షేక్ నజీర్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, యువ నాయకుడు సింహాద్రి వికాస్, ఏఎంసీ చైర్మన్ కె. వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయకుమార్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హక్కుల రక్షణలో యువత పాత్ర ప్రధానం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

బంటుమిల్లి: ఎందరో మహానుభావుల త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 75 సంవత్సరాల స్వాతంత్ర్య పయనం ఎటువైపు అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ 75 సంవత్సరాల్లో ప్రతి రంగం అభివృద్ధి చెందినా ఇంకా సాంకేతిపరంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగాల్సి ఉందని లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వాతంత్ర్యానికి ముందు పరిస్థితులు తర్వాత జరిగిన అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, డిగ్రీ, జూనియర్, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, ఎల్. అజయ్‌ఘోష్ పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. నిందితుడిపై పోక్సో కేసు నమోదు



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కోనేరుసెంటర్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని ఆర్‌పేట పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. మంగళవారం ఆర్‌పేట సీఐ రవికుమార్ కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. మచిలీపట్నానికి చెందిన బాలిక నగరంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 2వ తేదీన ఇంటికి వెళుతున్న బాలికను గుర్తు తెలియని ఓ యువకుడు సైకిల్‌పై వెంబడించాడు. బాలిక రాజా గోల్డ్ సెంటర్ వీధిలోకి వెళ్లగానే దగ్గరకు వెళ్లి ఆమెపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. భయంతో బాలిక వణికిపోతుండటంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సర్వజన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్‌పేట పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాలిక నుంచి జరిగిన ఘటనపై వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు బాలికపై దాడి చేసింది మచిలీపట్నంలోని నిజాంపేటకు చెందిన చిలకలపూడి నాగసాయి జయరామ్‌గా తెలియటంతో మంగళవారం అరెస్ట్ చేశారు. మద్యానికి బానిసైన నాగసాయి జయరామ్ కొంతకాలంగా నగరంలో చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సమావేశంలో ఆర్‌పేట ఎస్ఐ వాసు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు



పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయ గాలి గోపురం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. లక్షలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలిరానున్నందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18వ తేదీ శనివారం రాత్రి 7 గంటలకు జగజ్యోతి, రాత్రి 2 గంటలకు స్వామివార్ల దివ్య లీలా కల్యాణ మహోత్సవం 19వ తేదీ రాత్రి 8 గంటలకు రథోత్సవం జరుగుతుంది.

15 నుంచి బ్రహ్మోత్సవాలు

15వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి వారిని పెళ్లి కుమారుని చేస్తారు. సాయంత్రం ఆరు గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, అంకురారోపణ, రక్షా బంధన, దీక్షా వస్త్రధారణ. నవగ్రహ మండపారాధన, వాస్తు హోమం, ధ్వజారోహణ, రాత్రి 10 గంటలకు రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 18వ తేదీ రాత్రి 7 గంటలకు జగజ్యోతి కార్యక్రమం, రాత్రి ఒంటి గంటకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, తెల్లవారుజాము 2 గంటలకు స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవం, 5 గంటలకు నది వాహనంపై స్వామి వారు, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తారు. 19వ తేదీ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు నిత్యబలిహరణ, రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం, 23వ తేదీ రాత్రి 8 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 9 గంటలకు పుష్పశయ్యాలంకృత పవళింపు సేవ నిర్వహిస్తారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బడ్జెట్‌పై అవగాహన అవసరం

చిలకలపూడి(మచిలీపట్నం): బడ్జెట్‌లోని అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మారుతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల బడ్జెట్ ప్రాధాన్యతను వివరించారు. వైస్ చాన్సలర్ కె. రామ్మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వీటితో పాటు జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, శిక్షణా సంస్థలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెరిగాయని, అనేక వస్తువులు సొంతంగా తయారు చేసుకునే అవకాశాన్ని కల్పించారని చెప్పారు. అట్టడుగువర్గాల వారికి మేలు చేసేలా ఈ బడ్జెట్ రూపొందించబడిందన్నారు. ఆడిటర్ కె. శివరామకుమార్ మాట్లాడుతూ ఆదాయ పన్ను, బడ్జెట్‌లో కేటాయింపుల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లోటి స్కూల్‌లో చోరీకి యత్నం

పెడన: కొంకేపూడి సమీపంలోని పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్కూల్‌లోకి ప్రవేశించి మూడు ఆఫీసు గదుల తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. వారికి నగదు ఏమీ లభించకపోవడంతో సీసీ కెమెరాలను తీసుకువెళ్లి స్కూల్ బయట కాలువలో పడేశారు. ఆఫీసు గదులు తెరిచి ఉండటాన్ని మంగళవారం ఉదయం వాచ్‌మెన్, పనివారు గుర్తించి కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం క్లూస్ టీం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గూడూరు ఎస్ఐ, పెడన ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నీటి సరఫరా నిలుపుదల

మచిలీపట్నంటౌన్: నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి చిలకలపూడి వరకు ఉన్న పంపింగ్ మెయిన్ మరమ్మతుల కారణంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాను నిలిపివేస్తామని ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బలరామునిపేట లైటింగ్ సెంటర్ వద్ద 500 ఎంఎం డయా పైప్‌లైన్ లీకేజీ కారణంగా మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. 46, 47, 48, 49, 50 డివిజన్లలో తాగునీటి సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు. తిరిగి గురువారం ఉదయం 11 గంటలకు 3, 4, 5, 6, 7, 8, 10, 11, 12, 49, 50 డివిజన్లలో యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని వివరించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహనా ర్యాలీ



పెడన: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ప్రాథమిక స్థాయిలో వ్యాధిని నియంత్రించవచ్చని పెడన పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కె. నిఖిలేష్ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. లెప్రా సొసైటీ స్టేట్ కో–ఆర్డినేటర్ ఎం. రాధిక మాట్లాడుతూ మానవ శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే వాటిని కుష్ఠువ్యాధిగా అనుమానించాలన్నారు. వ్యాధి నివారణకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారని వివరించారు. సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహెద్ బాషా, పీహెచ్ఎన్ పైడేశ్వరమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు ప్రారంభించారు. సుధ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసి యువతలో క్రికెట్‌పై మక్కువ పెంచేలా కృషి చేస్తున్న నిర్వాహకులను పేర్ని కిట్టు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, గోపిశెట్టి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పురంశెట్టి శ్రీనివాసరావు, ఉప్పు వెంకటేశ్వరరావు, కోచ్ తాతయ్య పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

పెడన: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పట్టణ సచివాలయాల సమన్వయకర్త ఎండీ మతీన్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన కౌన్సిలర్ మెట్ల గోపీతో కలిసి ఆరో సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



కోడూరు: సీసీ రహదారి నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు మంగళవారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని పదో వార్డులో ఎంపీ గ్రాంట్ ద్వారా రూ.5 లక్షలు, ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా రూ.5 లక్షల నిధులతో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలుత 160 మీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టామని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

యార్లగడ్డ (చల్లపల్లి): నిరుపేద కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లి మండలం యార్లగడ్డలో సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 197 ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, గ్రామ పెద్దలు యార్లగడ్డ దుర్గా ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కర్రా రవి, మోపిదేవి ద్వారకానాథ్, సర్పంచ్‌లు మాతంగి రమ్య, తోట శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: జగనన్న చేదోడు పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ఎప్పటికీ మరిచిపోమని మచిలీపట్నం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు అన్నారు. స్థానిక చల్లరాస్తా సెంటర్‌లోని సంఘ కార్యాలయం వద్ద మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలుపుతూ నినదించారు. గతంలో ఏ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులను ఆదుకోలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమను గుర్తించి సాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వి. సుధాకర్ బాబు, నాయకులు పి. జగన్మోహనరావు, తరకటూరి సీతారాముడు, ఎం. బంగారయ్య, వి. రవి, వి. కేశవ, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలు దేశానికి ప్రమాదకరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మంగళాపురం (చల్లపల్లి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. దేశంలో ప్రధానిని విమర్శిస్తే దేశంపై దాడి, అదానీని విమర్శిస్తే ఆర్థిక వ్యవస్థపై దాడి అంటున్నారని చెప్పారు. మంగళవారం చల్లపల్లి మండలం మంగళాపురంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ అగ్రనేత దివంగత చంద్ర రామలింగయ్య 50వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రామలింగయ్య ఘాట్ వద్ద రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ చంద్ర రామలింగయ్య సేవలను వివరించారు. గుజరాత్ అల్లర్లపై బీబీసీ డాక్యుమెంటరీ తీస్తే ఎవరినీ చూడనివ్వని ప్రధాని మోదీ, అదానీపై హిడెన్ బర్గ్ నివేదికపై స్పందించని మోదీ తక్షణమే ఈ రెండు విషయాలపై సమాధానం చెప్పాలన్నారు. మైనారిటీలపై జరిగిన దాడుల గురించి బీబీసీ డాక్యుమెంటరీ ఎవరినీ చూడనివ్వకుండా చేశారన్నారు. ప్రధాని మోదీకి, అమిత్‌షాకు ఆప్తుడుగా ఉన్న అదానీ మూడేళ్లలో పది లక్షల కోట్లు సంపాదించాడని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతలు ప్రాణాలు, ఆస్తులు త్యాగం చేస్తే వీళ్లు వచ్చి దేశ సంపదను కొల్లగొట్టేస్తున్నారని అన్నారు. దేశం కోసం వీళ్లు, వీళ్ల కుటుంబాలు ఏమైనా త్యాగాలు చేశాయా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, నియోజకవర్గ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, చంద్ర ప్రసాద్, చంద్ర రామకోటేశ్వరరావు (ఆనంద్), సీఆర్ మనుమడు డాక్టర్ చంద్ర జయదీప్ పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అదనపు లోడు వినియోగదారులకు రూ. 5.23 లక్షల జరిమానా



మోపిదేవిలో తనిఖీలు చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు

మోపిదేవి: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అదనపు లోడు వినియోగిస్తున్న వారికి రూ. 5,23,000 జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారన్నారు. ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రాంబొట్లు ఆధ్వర్యంలో 31 బృందాలుగా ఏర్పడి 2,116 గృహ సర్వీసులు, 156 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారని చెప్పారు. వాటిలో 179 సర్వీసులకు అదనపు లోడు వినియోగిస్తున్నందున జరిమానా విధించామన్నారు. పలు మండలాల ఏఈలు, ఏడీలు, ఉయ్యూరు పరిధిలోని విద్యుత్ విజిలెన్స్ శాఖల డీఈఈ, ఏఈ, జెఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

బెల్ ఉద్యోగుల సహకార సంఘ ఎన్నికలు ఏకగ్రీవం



బెల్ ఉద్యోగుల సహకార సంఘ నూతన పాలకవర్గం

మచిలీపట్నంటౌన్: నగరంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ ఎంసీ యూనిట్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. తొమ్మిది మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా 21 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సంఘ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కొంత మంది పోటీ నుంచి తప్పుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మాగంటి సత్యనారాయణ వరప్రసాద్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొడాలి మణిబాబు, ఉపాధ్యక్షుడిగా నండూరి శివాంజనేయ కుమార్ ఎన్నికయ్యారు. సంఘ డైరెక్టర్లుగా కొనకళ్ల వీరవెంకటేశ్వరరావు, పసుపులేటి దివ్య, పీటీ కృష్ణప్రసాద్, ఒడుగు విజేంద్రబాబు, శ్రీరామచంద్రనాయక్, విశ్వనాథపల్లి వెంకట నరసింహారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డెక్కా విజయకుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంఘం బాసటగా నిలుస్తోందని చెప్పారు.

పీఏసీఎస్ అధ్యక్షుల పదవీ కాలం పొడిగింపు

పామర్రు: మండల పరిధిలోని 11 పీఏసీఎస్ అధ్యక్షుల పదవీ కాలం ఆరునెలల పాటు పొడిగిస్తూ గుడివాడ సహకార శాఖ డెప్యూటీ డైరెక్టర్ డి.విజయలక్ష్మి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పామర్రు, ఉండ్రపూడి, నిమ్మకూరు, నిమ్మలూరు, కొమరవోలు, పెదమద్దాలి, ఐనంపూడి, ఎలకుర్రు, జరువరం, కనుమూరు, జమీగొల్వేపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, మురారి వెంకట కుమారి, చిగురుపాటి ప్రవీణ్, ఆత్మూరి నాంచారయ్య, శింగవరపు రామచంద్రరావు, సుంకర శిరీష, బలుసు హరికిరణ్, కాశీనాథుని నాగేశ్వరరావు, కొలుసు కోటేశ్వరరావు, మత్తి వెంకట రమణ, కనుమూరు ధనలక్ష్మిలు ఆదేశాలు అందుకున్నారు. వీరిని ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు అభినందించారు.